ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు జిల్లా వార్తలు
5
సోమవారం 22 జనవరి 2024





అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం.. అంతా ఎదురు చూస్తున్న అయోధ్య రాముని ప్రతిష్ఠా మహోత్సవం రానే వచ్చింది.. ఆ దివ్య కార్యక్రమానికి మద్దతుగా ఉమ్మడి పశ్చిమ జిల్లా అంతటా రామదండు కదిలింది.. ఎక్కడ చూసినా జై శ్రీరామ్ నినాదాలే.. ఇళ్లపై కాషాయ జెండాలు రెపరెపలాడాయి.. పురవీధుల్లో అయోధ్యరామ వైభవ యాత్రలు నిర్వహించారు.. యువకులు బైక్ ర్యాలీలు చేపట్టారు.. రామనామ భజనలతో శోభాయాత్రలు చేశారు.. ప్రత్యేక పూజలకు రామాలయాలు ముస్తాబయ్యాయి.. అద్భుతమైన ప్రతిష్ఠా ఘట్టాన్ని తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.. ఇప్పుడు ఎక్కడ చూసినా రామనామ జపమే..

జై శ్రీరామ్

రామ మందిరం

ఎన్ని ఎదురుచూపులో ! కన్ను లెంత లెంత
కాయలాయెనో ! తుదకు సాక్షాత్కరించు
చుంటివా రామ ! నేడి ట్లయోధ్యలోన
భారతధరిత్రి పున్నెంబు లేరుకొనెను

అదిగో ! సరయూనదీ ప్రవాహమ్ము నుండి
వినబడెడి గలంగలలకు వేష్ఠజెంది
అనువుగా అందె నవరించుకొనెను నేడు
భారతీయాత్మ ! రావె ! ఇక్ష్వాకురామ !

శబరియై వేదఋషి నిను స్వాగతించె
కలలు ఫలియింపగ ; ప్రతి ముఖమ్ము రామ
మందిరంబై ప్రమోదించె - మలుపు తిరిగె
రామ ! తాత్త్విక జగతి ! నీరాజనములు !

- రసరాజు

ఏలూరు సిటీ, జనవరి 21 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రత్యేకంగా కల్యాణోత్సవాలను నిర్వహించారు. బాలరాముని ప్రతిష్ఠ సమయంలో శ్రీరామనామ సంకీర్తనలను చేయాలని నిర్ణయించారు. రామాలయాలను పచ్చటి మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రత్యేక ఆధ్యాత్మిక భజనా కార్యక్రమాలను నిర్వహించడానికి ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. తూర్పు యడవల్లిలోని సీతారామ చంద్రస్వామి ఆలయం, చాట్రాయి మండలం చనుబండలోని కోదండరామస్వామి ఆలయాలతో పాటు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, కైకలూరు, చింతలపూడి ప్రాంతాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, శోభాయాత్రలు, అన్నసమారాధనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఇళ్లపై జైశ్రీరామ్ జెండాలు

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలోని వెలమపేటలో 300 ఇళ్లు ఉంటాయి. వారంతా నిత్యం కోదండ రామాలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా 300 ఇళ్లపై జైశ్రీరామ్ జెండాలు ఎగురవేశారు. గ్రామంలోని యువకులు ఘంటా తరుణ్, ఎం.భరత్, పి.వాసు, ఆకాష్, ఎ.జి.ఎస్.కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రగడవరంలో ప్రతీ ఇంటి మీద జైశ్రీరామ్ నినాదాలతో 600 జెండాలు ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. యండపల్లి, గుల్లపాడు, శివపురం గ్రామాలకు చెందిన మహిళా రామభక్తులు గ్రామంలో ఇళ్లపై జెండాలు ఎగురవేసి అక్షింతలు ఇంటింటా పంచిపెట్టి శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి కోదండ రామాలయం వరకు భారీ ర్యాలీ జరపడానికి ఏర్పాట్లు చేశారు. అభయాంజనేయస్వామిని మామిడి తోరణాలు, టెంట్లు వేసి జెండాలతో అలంకరించారు. ఉదయం 9.30 గంటలకు ర్యాలీ జరిపి కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన లక్ష తులసీ పూజ, లక్ష చామంతి పూజలో భక్తులు పాల్గొంటారు. అక్కడే తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య కార్యక్రమం లైవ్ టెలికాస్ట్ కోసం టీవీలు ఏర్పాటు చేశారు.

అంతటా రామనామ జపం

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ వేళ జిల్లా అంతటా శోభాయాత్రలు

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు


విద్యుత్ కాంతుల్లో ఏలూరు ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయం


యండపల్లి, గుల్లపాడు మహిళా రామభక్తుల శోభాయాత్ర

రామాలయాల్లో భజనలు

కలిదిండి : కలిదిండి మండలంలో రామాలయాలను ముస్తాబు చేశారు. హిందూ ధర్మ ప్రచారకులు ఇంటింటికి శ్రీరామ్ జెండాలను పంపిణీ చేశారు. కోరుకొల్లు, పెదలంక రామాలయంలో ఉదయం నుంచి భక్తులు భజనలు చేశారు. అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా రామాలయాల్లో లైవ్ టీవీలను ఏర్పాటు చేశారు.


తణుకు వైభవ యాత్రలో చిన్నారులు

కామవరపుకోటలో ప్రదర్శన

కామవరపుకోట : మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాల వద్ద, ప్రధాన కూడళ్లల్లోను సోమవారం అయోధ్య రాముడి ఆనంద సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు గ్రామంలో శ్రీరామ్ జెండాలను చేతపట్టుకుని జై శ్రీరామ్ అంటూ గ్రామంలో ప్రదర్శనలు జరిపారు. దేవాలయాలను ముస్తాబు చేశారు.


కామవరపుకోటలో జైశ్రీరామ్ అంటూ పాదయాత్ర


చింతలపూడి అభయాంజనేయస్వామి ఆలయం వద్ద..


పాలకొల్లులో అయోధ్యరామ వైభవ యాత్ర

వైభవంగా సీతారాముల కల్యాణం

తణుకు : తణుకు పట్టణంలో అయోధ్య శ్రీరామ వైభవ యాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేల్పూరు రోడ్డులోని వీరనారాయణ థియేటర్ సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో సీతారాములు విగ్రహాలతో పాటు మేళతాళాలు, కోలాట నృత్యాలు, శ్రీరామ నామ కీర్తనలతో శోభాయాత్ర సాగింది. యాత్ర నరేంద్ర సెంటర్ మీదుగా ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ వరకు సాగింది. కళాశాల ప్రాంగణంలో రాత్రి సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.


చింతలపూడి వెలమపేటలో ఇళ్ల మీద జైశ్రీరామ్ జెండాలు




ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. జంగారెడ్డిగూడెం మండలం కేతవరంలోని మూడు పోలింగ్ బూత్‌ల పరిధిలో 27 మంది వివిధ కారణాల వల్ల మృతి చెందారు. అయితే ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లు తొలగించాల్సిన బూత్ లెవెల్ అధికారులు నిర్లక్ష్యం వహించి వారి పేర్లను జాబితాలో నుంచి తొలగించకపోవడంతో గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అందిన ఫిర్యాదుపై జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్వీవజోజిని విచారణ చేయమని ఆదేశాలు ఇవ్వగా తహసీల్దార్ సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించారు. దీంతో బూత్ లెవల్ అధికారులుగా ఉన్న వీఆర్వో రమేశ్, వీఆర్‌ఏ బెనర్జీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గణేశ్ తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా ఆదివారం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలవరం టిక్కెట్ బొరగం శ్రీనివాస్‌కే..

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని



కొయ్యలగూడెం, జనవరి 21 : పోలవరం నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ బొరగం శ్రీనివాస్‌కే ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు స్పష్టం చేశారు. బయ్యన్నగూడెంలో ఆదివారం టీడీపీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గన్ని మాట్లాడుతూ నియోజకవర్గ అల్లుడిగా బొరగం శ్రీనివాస్ వస్తున్నాడని.. గెలిపించుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం విలేకరులు గన్నిని టిక్కెట్టు విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరగా.. 'బొరగానికే టిక్కెట్టు వస్తుంది. అందులో డౌట్ లేదు..' అని వ్యాఖ్యానించారు.

ఎక్కడికెళుతున్నారు..?

- జిల్లాలో అడుగడుగునా పోలీసుల తనిఖీలు
- రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో నిఘా
- నేడు సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన అంగన్‌వాడీలు

ఏలూరు క్రైం, జనవరి 21 : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ముట్టడి చేయడానికి పిలుపు నిచ్చారు. ఈనేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ యంత్రాంగం, అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులకు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే ఆదివారం మధ్యాహ్నం నుంచి నోటీసులు పోలీసులు జారీ చేస్తున్నారు. విజయవాడలో సీఎం క్యాంపు కార్యాలయానికి వెల్లడానికి ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొంటున్నారు. కొంతమంది నాయకు లను గృహ నిర్బంధంలో ఉంచారు. పోలీసులు మఫ్టీలోనే నిఘా ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వారికి షాడో పార్టీలుగా ఉంటూ వారి కదలి కలపై నిఘా పెట్టారు. జిల్లాలోని ప్రధాన మండల కేంద్రాలు, విజయవాడకు వెళ్లే మార్గాల్లో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. మండల పరిధిలో ఉద్యమ నాయకులపై నిఘా పెట్టి నోటీసులు అందించారు. ఏలూరు నగరంలో త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కొత్త బస్టాండ్, వట్లూరు సెంటర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మహిళా ప్రయాణికులను ఎక్కడికి వెళ్తున్నారు, ఏ ఊరు వెళ్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులను ప్రశ్నించారు. ఏలూరు పాతబస్టాండ్, పెద్ద రైల్వేస్టేషన్, పవర్ పేట ప్రాంతాల్లో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆశ్రం జంక్షన్, కలపర్రు టోల్‌గేటు వద్ద కూడా ఈ తనిఖీలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం వరకూ కూడా తనిఖీలు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే కొంత మంది నాయకులు ముఖ్యమైన అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడకు చేరిపోయినట్లు తెలుస్తోంది.


ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులను ఆరా తీస్తున్న త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు



అంగన్‌వాడీలకు నోటీసులు

ముదినేపల్లి : విజయవాడలో సోమవారం నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమానికి ముదినేపల్లి మండలం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు వెళ్లకుండా నిరోధించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఆదివారం పోలీసులు నోటీసులు అందజేశారు. విజయవాడ వెళ్లవద్దని, నిబంధనలు పాటించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండలం నుంచి ఇప్పటికే పలువురు అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులు సోమవారం నాటి నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లారు. సోమవారం వెళ్లే వారిని అడ్డుకునేందుకు ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

సామాన్య ప్రయాణికుల్లా..

ఏలూరు రూరల్ : సమస్యలు పరిష్కరించాలని గత 40 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా అంగన్‌వాడీ వర్కర్లు ఆదివారం వివిధ మార్గాల ద్వారా విజయవాడ పయనమయ్యారు. సమస్యలు పరిష్కారానికి సోమవారం సీఎం జగ న్ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం పలుచోట్ల అంగన్ వాడీలు సమ్మె చేయకుండా వివిధ మార్గాల ద్వారా విజయవాడ తరలివెళ్లారు. సోమవారం బయల్దేరితే ఎక్కడికి అక్కడ పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉండ డంతో ఆదివారమే బస్సులు, ఆటోలు, రైళ్లల్లో సామాన్య ప్రయాణికుల్లా బయల్దేరి వెళ్లినట్టు తెలిసింది. నాయకుల ఫోన్‌లు సైతం స్విచ్‌ఆఫ్ వస్తున్నాయి. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని 40 రోజులుగా జిల్లా వ్యాప్తంగా సుమారు 4 వేలమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేపట్టారు. వివిధ రూపాల్లో ప్రభుత్వానికి నిరసనలు తెలియచేస్తున్నారు. సమ్మెశిబిరాల వద్దే 24గంటల దీక్షలకు సైతం దిగారు.

హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడు. తండ్రిమాట జవదాటని ధీరుడిగా, ఆదర్శ పురుషుడిగా భక్తులు కొలుస్తారు. అయోధ్యలో నిర్మించిన రామాలయంలో నేడు శ్రీరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని రామాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య భక్తులు పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అంతటా శ్రీరామ నామ స్మరణే నెలకొంది. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని కొన్ని ప్రసిద్ధ రామాలయాల చరిత్రను తెలుసుకుందాం..



అంతటా రామ నామ స్మరణే..

మరో భద్రాద్రి.. సిద్ధాపురం కోదండ రామాలయం

» కొల్లేరు తీరంలో రామాలయం

ఆకివీడు రూరల్, జనవరి 21 : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు సరస్సు తీరాన్న పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల సరిహద్దులో, పూర్వం అనేక మంది ఋషులు, సిద్ధులు తపస్సు చేసి సిద్ధిపొంది సిద్ధాపురంగా పేరుగాంచిన సిద్ధాపురం గ్రామంలో పడమర దిక్కుగా మరో భద్రాద్రిగా దర్శనమిచ్చే విధంగా ఆలయాన్ని నిర్మించారు. గ్రామ నడిబొడ్డున సుమారు పదకొండు ఎకరాల మంచినీటి చెరువు, పడమర గట్టున వందల ఏళ్ల చరిత్ర కలిగిన పెద్ద మర్రిచెట్టు ఉండేది. 1962-63 సమయంలో ఒక పెద్ద తుపాన్‌కు ఆ మర్రి చెట్టు నేలకొరగడం, ఈ ప్రాంతంలో ఆవుల మందలు సంచరిస్తూ ఉండడంతో 1965లో సుదీంద్రరామకృష్ణబాబుచే కోదండరామాలయం నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ప్రముఖ వాస్తుశిల్పి పద్మశ్రీ గణపతి స్థపతి, ఆగమ శాస్త్ర పండితులు శఠగోపాలాచార్యులు, వాస్తు శిల్పులు శ్రీనివాసాచార్యులు, శ్రీసుబ్బయ్య ఆధ్వర్యంలో ఇబ్రహీం పట్టణంలోని ఇంద్ర కీలాద్రి పర్వతశ్రేణి నుంచి తీసుకువచ్చిన శిలలతో ఆలయ నిర్మాణం చేసినారు. ఆలయంలో మూల విరాట్టులు తమిళనాడులోని రామనాథపురం జిల్లా కారైకుడి, కంచిలో తయారైనవి. 1995లో కంచి కామకోటి పీఠాధిపతులు జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా మూలవిరాట్టులు ప్రతిష్ఠించబడ్డాయి. ప్రతి ఏటా శ్రీరామనవమి భద్రాచలానికి దీటుగా వేడుకలు చేస్తారని, ధనుర్మాసంలో కైంకర్యాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారని ప్రతీతి. శ్రీరామనవమి రోజున వేలాదిమందికి అన్నసంతర్పణతోపాటు పానకం పంపిణీ జరుగుతుంది. దూర ప్రాంతాల నుంచి అనేకమంది స్వామివారి దర్శనానికి తరలి వస్తారు. అయోధ్యలోని రాముడి ప్రతిష్ఠకు ఆలయంలోని అన్ని ఏర్పాట్లు చేసినట్లు, గ్రామంలో శ్రీరామనామ సంకీర్తన చేస్తూ ప్రసాద వితరణ చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ భూపతిరాజు వెంకటేశ్వరరాజు తెలిపారు.


సిద్ధాపురంలో కోదండ రామాలయం

తూర్పుయడవల్లిలో చినభద్రాద్రి క్షేత్రం

ద్వారకాతిరుమల, జనవరి 21 : భక్తజన అభీష్ట ప్రదాయకుడైన జగదభిరాముడు రమ్యమోహనంగా కొలువుతీరిన క్షేత్రం తూర్పుయడవల్లి. ఒక దాత భక్తిసంకల్పానికి ఈ క్షేత్రం ఒక చిహ్నం. భద్రాచలంలో ఉన్న రీతిలోనే ఇక్కడ సీతాలక్ష్మణ సమేతంగా రాఘవుడు గర్భాలయంలో మూలవరులుగా కొలువుతీరి భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. దాదాపు దశాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ క్షేత్రం చినభద్రాద్రిగా పేరొంది ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయంగాను, ఆధ్యాత్మిక సన్నిధిగా అలరాడు తోంది. జిల్లాలోనే విశిష్ట రామాలయంగా, ఆహ్లాదకరమైన ప్రకృతి పరిసరాల నడుమ ఆలయాన్ని ఎకరం విస్తీర్ణంలో కోటి రూపాయలు వెచ్చించి నిర్మించా రు. 52 అడుగుల ఎత్తుతో ప్రధాన గోపురం, 14 అడుగుల ఎత్తుతో సింహ ద్వారంతో ఈలోగిలి కళకళలాడుతోంది. ఆలయ ముఖ మండపంలో శిల్పకళా సౌందర్యాలతో పాటు మేషం నుంచి మీనం వరకూ 12 రాసులు, చిన్ని కృష్ణుని శిల్పం, పర్ణశాల మరింతగా వన్నె తెస్తున్నాయి.

2003 నుంచి శ్రీవారి దత్తత దేవాలయంగా..

ఈ ఆలయాన్ని అప్పటి మంత్రి కోటగిరి విద్యాధరరావు దంపతుల కృషితో చినజీయర్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయగా 2003లో ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తోంది. ఆలయ ప్రాంగణంలో వనవాస ఘట్టంలో శబరి చేతి నుంచి పండ్లు స్వీకరిస్తున్న రామలక్ష్మణులమూర్తులు సజీవ కళతో భక్తులను ఆకట్టుకుంటున్నాయి. రామాలయానికి అభిముఖంగా భక్తాంజనేయ సన్నిధి, ఆలయ ప్రాంగణంలో రాజ్యలక్ష్మీ మాత, గోదాదేవి అమ్మవార్ల మూర్తులు పూజలందుకుంటున్నాయి. పాంచరాత్ర ఆగమ విధానంలో ఆలయంలో నిత్యోత్సవం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చైత్రమాసంలో శ్రీరామనవమి ఉత్సవాలు, సామ్రాజ్య పట్టాభిషేకం, జ్యేష్ఠ మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పాంచాహ్నికంగా జరుపుతారు. ప్రతీనెల పునర్వసు నక్షత్రంలో శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తారు.


తూర్పుయడవల్లిలో రామాలయం


గర్భాలయంలో సీతా సమేత జగదభిరాముడు

పెనుమంట్రలో 150 ఏళ్ల రామాలయం

పెనుమంట్ర : పెనుమంట్ర గోస్తనీ నది పక్కన ఉన్న పురాతన రామాలయం సుమారు 150 ఏళ్ల క్రితం తోలేటి కైలాసరావు ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటినుంచి వారి కుమారుడు తోలేటి రామకృష్ణారావు వారి కుమారుల పర్యవేక్షణలో ఉంది. తోలేటి కైలాసరావుకు చెందిన తొమ్మిది ఎకరాల భూమిపై వచ్చే ఆదాయంతో ఆలయంలో దీప, నైవేద్యాల కోసం, బ్రాహ్మణుల పోషణ కోసం 1975 నుంచి ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వారు దూరప్రాంతంలో ఉండడం వల్ల ఆలయానికి సంబంధించి పనులను దాట్ల సత్యనారాయణరాజు, తండ్రి సత్యనారాయణరాజు చూస్తున్నారు. అర్చకులుగా గోవర్ధన వెంకటాచార్యులు పూజలు చేస్తున్నారు. సోమవారం ఉదయం అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్డి యువజన సంఘం తేతలి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి రామాలయం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పెనుమంట్రలో రామాలయం (ఇన్‌సెట్‌లో) విగ్రహాలు


వీరవాసరంలో సీతారామస్వామి ఆలయం


దేవాలయంలో మూలవిరాట్

భద్రాద్రి తరహాలోనే వీరవాసరంలో..

» నేడు సీతారామస్వామి ఆలయంలో నగర సంకీర్తనకు ఏర్పాట్లు

వీరవాసరం, జనవరి 21 :వీరవాసరంలో వందల ఏళ్లనాడే పూర్వీకులు భద్రాద్రి సీతారామస్వామి ఆలయం తరహాలోనే దేవాలయాన్ని నిర్మించారు. కాలక్రమేణ దీనిని పునఃనిర్మాణం చేశారు. స్వామివారికి ఏటా శ్రీరామనవమి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. అన్ని పర్వదినాలలోనూ భక్తులు స్వామిని దర్శించుకుంటారు. దేవాలయంలోని మూలవిరాట్ సీతారామ లక్ష్మణతో కలిపి భద్రాద్రి తరహాలోనే కొలువై ఉంటారు. స్వామి సన్నిధిలో వివాహాలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఆయోధ్య రామాలయం ప్రారంభోత్సవం స్వామివారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పంపిణీ చేస్తున్న అక్షింతలను కూడా ఈ ఆలయం నుంచి గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. వీరవాసరం మండలంలో ఉన్న 23 ఆలయాలకు ఆయా ప్రాంతవాసు లకు అందజేసేలా అక్షింతలను అం దించారు. సమరసత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూపరిషత్, బీజేపీ నాయకులు ఈ ఆలయం వద్ద నుంచే పండుగ వాతావరణాన్ని తీసుకు వచ్చారు. ఆదివారం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున నగర సంకీర్తనకు సన్నాహాలు చేయగా గ్రామాల్లోని రామాలయాల్లో భజన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



ఏడీజే కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, సెషన్స్‌ను ప్రారంభించిన దృశ్యం

కోర్టును గౌరవప్రదంగా నిర్వహించుకోవాలి

» ఏపీ హైకోర్టు అడ్మినిస్టేటివ్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 21: చిరకాలంగా ఎదురుచూస్తున్న ఏడీజే కోర్టు ప్రారంభించామని ఆ కోర్టును గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని ఏపీ హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో 11వ అడిషినల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ (ఏడీజే) కోర్టు, జడ్జి చాంబర్, ఆఫీస్ గదులు, సబ్ పోస్టాఫీసును ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనతోపాటు వచ్చిన హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ నైనాల జైసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి, జస్టిస్ వి. గోపాలకృష్ణారావు, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సి. పురుషోత్తంకుమార్, ఏడీజే హైకోర్టు ఇన్‌చార్జి బి.సత్యవతిలకు పోలీసులు గౌరవ వందనం అందించారు. కోర్టులో సర్వమత ప్రార్థనలు చేశారు. లా సెక్రటరీ జి. సత్యవరప్రభాకరరావు, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సూర్యకిరణ్‌శ్రీ, సెకండ్ అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అన్నామణి, ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారికి ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి21: చినవెంకన్నకు క్షేత్ర పురవీధుల్లో ఆదివారం రాత్రి జరిగిన ఏకాదశి ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయ ప్రాంగణంలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పుష్పాలం కరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదఘోషల నడుమ శ్రీవారి వాహనం తిరువీధుల్లో విహరించింది. ప్రతీ ఇంటిముందు స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు పట్టారు.


క్షేత్ర తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ద్వారకాతిరుమల, జనవరి 21: కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా అధికారులు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ కార్యదర్శి నందూరి ఉమ పిలుపునిచ్చారు. ఆదివారం గుణ్ణంపల్లి జడ్పీ పాఠశాలలో సర్పంచ్ తానిగడప సుజాత ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు ఉన్న అవగాహన, పథకాల అమలు తీరుపై సంతృప్తిని వ్యక్తం చేసి పాలనా యంత్రాంగం కృషిని అభినందించారు. తొలుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో నానో డీఏపీ యూరియా వినియోగంపై డ్రోన్ స్ప్రేయింగ్ ప్రదర్శించారు. భారత్ ఆయుష్మాన్ ఐడీ కార్డు, మహిళా లబ్ధిదారునికి ప్రధాని ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆమెను పలువురు సత్కరించారు, కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహినీవెంకన్నబాబు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీపీవో విశ్వనాథ శ్రీనివాస్, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకటకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో శర్మిష్ట, అధికారులు పాల్గొన్నారు.



వికసిత్ సంకల్పయాత్ర సమావేశంలో మాట్లాడుతున్న నందూరి ఉమ


ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మేనత్త, హాస్యనటుడు అల్లు రామలింగయ్య సోదరి ఆకుల సత్యవతి ఇటీవల మృతి చెందింది. ఆదివారం ఉదయం నిర్మాత అల్లు అరవింద్ పాలకొల్లు విచ్చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. - పాలకొల్లు రూరల్

సంఘటిత ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం

» ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

వీరవాసరం, జనవరి 21 : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకోవడానికి సంఘటిత ఉద్యమాలు చేయాల్సిందేనని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. ఆదివారం వీరవాసరం తులసీ కన్వెన్షన్‌లో పశ్చిమ గోదావరి జిల్లా 36వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సమస్యలపై రాజీలేకుండా, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పోరాటం చేస్తుంది ఒక్క ఏపీయూడబ్ల్యూజే మాత్రమేనని అన్నారు. రాష్ట్ర విభజన తరువాత నాటి సీఎం చంద్రబాబునాయుడుని కలిసి సమస్యలు వివరించామన్నారు. విభజిత రాష్ట్రంలో హెల్త్ స్కీమును ప్రభుత్వం అనుమతించిందన్నారు. ప్రమాద బీమాతోపాటు జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకానికి వంద కోట్ల బడ్జెట్ కేటాయించారని గుర్తు చేశారు. 2019లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కూడా జర్నలిస్టులు సమస్యలను వివరించే కార్యక్రమం చేపట్టి నా ఫలితంలేదన్నారు. కరోనా సమయంలో చనిపోయిన జర్నలిస్టులకు న్యాయం చేయాలని సంతకాలతో వినతి పత్రమిచ్చినా ఫలితం లేదని, చాలామంది అక్రిడిటేషన్లు కోల్పోయారని అన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, పోరాటాలను వివరించారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, చిన్న, మధ్య తరహా పత్రికల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.రమణారెడ్డి, విజయవాడ ప్రెస్ క్లబ్ సీనియర్ నాయకుడు దారం వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజుశ్రీనివాసవర్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, వీరవాసరం మండల పరిషత్ అధ్యక్షురాలు వీరవల్లి దుర్గాభవాని , టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. అనంతరం మహాసభ నిర్వహణకు పూర్తి సహకారం అందించిన వీరవాసరం జర్నలిస్టు గోపాలకృష్ణ, తులసి కన్వెన్షన్ సెంటర్ యజమాని మళ్ల రాంబాబును ఘనంగా సత్కరించారు. తొలుత ఇటీవల కన్నుమూసిన పాత్రికేయులకు నివాళులర్పించారు. ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా శాఖ కార్యదర్శి వీఎస్ సాయిబాబు, గజపతి వర ప్రసాద్, కేవీ ప్రసాద్ మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నుంచి రెండు వందల యాభై మంది పాత్రికేయులు హాజరయ్యారు.


సమావేశంలో పాల్గొన్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

31న ఆదికవి నన్నయ వర్సిటీ స్నాతకోత్సవం

» గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం » పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

రాజమహేంద్రవరం, జనవరి 21: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 స్నాతకోత్సవ వేడుకలను ఈనెల 31న నిర్వహిస్తామని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆదివారం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నన్నయ వర్సిటీ పరిధిలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, మన్యం (సగభాగం) జిల్లాల్లోని 390 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వ విద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో స్నాతకో త్సవం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో భాగంగా 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరానికి చెందిన పీహెచ్‌డీ, పీజీ, పీజీ డిప్లమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన వారికి పట్టాలు అందజేయనున్నారు. 13,14,15 స్నాతకోత్సవానికి వివిధ కోర్సులకు చెందిన 500 మంది విద్యార్థులు అప్లై చేసుకోగా, వీరిలో పీహెచ్‌డీ 12, గోల్డ్‌మెడల్స్ 12, ప్రైజ్ 12, మిగిలిన వారు పీజీ కోర్సులు ఎంఏ, ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఈడీ, ఎల్ఎల్‌బీ, బీఈడీ కోర్సులు పూర్తిచేసిన వారున్నారు. వీరందరికి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు ప్రదానం చేయనున్నారు. మరో ముఖ్యఅతిథి భారతీయ సంఘ సేవకురాలు, రచయిత్రి, కంప్యూటర్ ఇంజనీర్, పద్మశ్రీ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవాన్ని పండ గలా నిర్వహించేందుకు వర్సిటీ అధ్యాపకులు, అందరూ సహకరించాలని ఈ సందర్భంగా వీసీ కోరారు.


నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

క్రైం సమాచారం

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

భీమడోలు, జనవరి 21 : మద్యం మత్తులో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం భీమడోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమడోలు గ్రామంలోని వెలంపేటలోని సొంత ఇంటిలోనే మద్యం మత్తులో గెడ్డాపు హేమంత్‌కుమార్(28) పలు మార్లు ఇంటిలోని వారితో తగువుపడుతూ గతంలో పలు మార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆదివారం తన నానమ్మతో గొడవ పడి ఉరి వేసుకున్నట్టు తెలిసింది. దీనిపై అతడి సోదరుడు గెడ్డాపు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమడోలు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లింగపాలెం, జనవరి 21: సింగగూడెంకు చెందిన ఓ వ్యక్తి పురుగుమందు ఘాటుకు చనిపోయినట్టు ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. గ్రామానికి చెందిన గోగం రంగారావు(35) శనివారం పొలంలో పురుగుమందు పిచికారీ చేసి ఇంటికి వచ్చాడని, తల తిరుగుతూ వికారంగా ఉందని చెప్పి వాంతులు చేసుకున్నాడు. అతడి భార్య సుధారాణి తన కుటుంబసభ్యులకు తెలుపగా వెంటనే చింతలపూడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'అనారోగ్యంతోనే ఆత్మహత్య'

ఏలూరు క్రైం, జనవరి 21 : ఏలూరు పవర్‌పేట రైల్వే గేటు సమీపంలో ఈనెల 20వ తేదీ సాయంత్రం అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. ఏలూరు లంకపేటనకు చెందిన ములపర్తి విజయ్‌బాబు(30) సోరియాసిస్ అనే చర్మ వ్యాధితో బాధపడుతూ కోలుకోలేక మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ మేరకు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఆదివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 21 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న సిరిబత్తిన శివన్నారాయణ రాత్రివేళ మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అతడిని అరెస్టు చేసి, ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఈబీ సర్కిల్‌లో 414 కేసులు నమోదు

చింతలపూడి, జనవరి 21 :చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 2023లో 414 సారా కేసులు నమోదు చేసి 442 మందిని అరెస్టు చేశామని ఎస్ఈబి సీఐ సాయిస్వరూప్ ఆదివారం తెలిపారు. ఈక్రమంలో 2,525 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, 787 కిలోల నల్ల బెల్లాన్ని, 51 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 200 లీటర్ల ఎన్‌డీపీ మద్యం, 10 కిలోల గంజాయిని పట్టుకున్నామని, 515 మందిని బైండోవర్ కేసుల్లో నమోదు చేశామని, నలుగురిపై పీడీ యాక్టు నమో దు చేశామని, 52,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 :జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో బెల్ట్‌షాపులో మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ట్రైనీ డీఎస్పీ బి.విద్య ఆదివారం తెలిపారు. గ్రామంలో గంగాదరరావు అనే వ్యక్తి మద్యం సీసాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి అతడి వద్ద నుంచి రూ.710 విలువ చేసే రెండు మద్యం సీసాలు, రెండు బీర్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు దొంగిలించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పేరంపేట గ్రామంలో రైతు బి.గోపాలకృష్ణకు 97 సెంట్ల పొలం ఉంది. ఆదివారం పొలం వెళ్లి చూసే సరికి ఆ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు దింపి ఉండడాన్ని గమనించారు. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ రాగి వైరును దొంగిలించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రైనీ డీఎస్పీ విద్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

పెదపాడు, జనవరి 21 : పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశామని ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. వారి వద్ద వద్ద నుంచి రూ.3,220 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పెదపాడు పోలీసులు తెలిపారు.

శ్రీవారి ఆర్జిత సేవలకు ఆఫ్‌లైన్లోనూ టికెట్లు

ద్వారకాతిరుమల, జనవరి 21: చిన్నతిరుమలేశుని క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్జిత సేవా టికెట్లను ఆన్‌లైన్‌తోపాటు ఇకపై ఆఫ్‌లైన్‌లో విక్రయాలు ప్రారంభమయ్యాయి. కొంతకాలం క్రితం ఆలయంలో ఈ ఆన్‌లైన్ టికెట్ల విధానాన్ని ఆలయ అధికారులు ప్రవేశపెట్టారు. ఈ సేవలు పొందే భక్తులు కొందరు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి వాటి పరిజ్ఞానం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. కొందరైతే మొక్కుబడులను చెల్లించకుండానే వెళ్లేవారు. కొంతమేర ఆర్జిత సేవల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది. ఈ విషయాన్ని గమనించిన అధికారులు నిత్యకల్యాణ మండపం వద్ద భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందేందుకు కియోస్క్ మిషన్‌లను సైతం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్లు ఎలా పొందాలి అన్నదానిపై అవగాహన కల్పించేలా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో తాజాగా ఆఫ్‌లైన్ టికెట్లను ఇవ్వడం పట్ల భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



ఎస్టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా శామ్యూల్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 21 : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంఘ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.శామ్యూల్, కె.ఆర్. పవన్‌కుమార్ ఎన్నికయ్యారని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు, పోకడలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశం అనంతరం ఎస్టీయూ జిల్లా కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఆర్థిక కార్యదర్శిగా జి.రామును ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా డీవీవీ. ప్రసాదరాజు, పీబీవీఎస్ఎల్. నారాయణ, పిఎస్. ప్రకాశరావు, బి.వి.బాలాజీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బి.జవహర్‌లాల్‌రాజు, పరిశీలకుడిగా కె.వి.రామచంద్రరావు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి పలువురు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘ రాష్ట్ర నాయకులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న తాళ్ళపాలెం తేగలు, కాల్చుతున్న దృశ్యం

తాళ్ళపాలెం తేగలకు మహా డిమాండ్

» సైజును బట్టి వంద తేగలు రూ.500-600 వరకు
» ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్న తేగలు
» సీజన్‌లో అనేకమందికి జీవనోపాధి

గణపవరం, జనవరి 21: ఉమ్మడి పశ్చిమ జిల్లాల ప్రజలకు సంక్రాంతి పండుగ సమయం నుంచి ముందుగా గుర్తుకొచ్చేది తేగలు. ఎంతో మేలు చేసే పలు రకాల పోషకాలు ఉన్న తేగలు మార్కెట్‌లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిసెంబరు నుంచి మార్చి వరకు చలికాలంలో మాత్రమే విరివిగా లభించే తేగలు చిన్న పిల్లలు, పెద్దవారు అమితంగా ఇష్టపడి తింటుంటారు. వర్షాకాలంలో రాలిపోయి పడిపోయిన తాటికాయల్ని భూమిలో పాతితే వచ్చే మొలకలే తేగలు. కుండలో నీరుపోసి తేగలను ఉడికించడం ఒక రకమైతే కేవలం నిప్పులపై కాల్చటం మరోవిధానం. నిప్పులు మీద కాల్చింది మంచి రుచిగా ఉంటుందని ఎక్కువగా ఇష్టపడతారు.

ఏలూరు జిల్లాలోని మెట్ట, పశ్చిమ గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతాల్లో పుష్కలంగా లభిస్తుంటాయి. గణపవరం మండలంలోని తాళ్ళపాలెం తేగలంటే ఓ ప్రత్యేకత ఉంది. ఈ తేగలు రుచి, నాణ్యతగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేసి ఇష్టంతో తింటారంటే అతిశయోక్తి కాదు. తెలంగాణలోని హైదరాబాదు, చెన్నై, ముంబై, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, బెంగళూరు, తదితర రాష్ట్రాలకు తాళ్ళపాలెం తేగలు తరలిస్తుంటారు. సంక్రాంతి పండుగకు వచ్చిన ఇతర ప్రాంతాల వారు కూడా ఈ తేగలను తీసుకెళ్తుంటారు. భూమి తీరు, తేగలు కాల్చడం వల్ల మంచి రుచి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. వంద తేగలు సైజును బట్టి రూ.500-600 వరకు విక్రయిస్తున్నారు. గణపవరం, పిప్పర వంటి ప్రధాన కేంద్రాల్లో కూడా రహదారులు వెంబడి విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో స్థానికంగా అనేక మంది తోపుడు బళ్ళ మీద, సైకిళ్ళు, మోటారు సైకిళ్లపై కూడా నగరాలకు, పల్లెల్లోనూ విక్రయిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు.

అంతా రామమయం..

» నేడు అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ..

» ఆనంద సంబరాలకు ఆలయాల ముస్తాబు



విద్యుత్ అలంకరణలో అగ్రహారంలోని రామమందిరం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 21 : అయోధ్యలో రామమందిరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సోమవారం మధ్యాహ్నం జరుగనున్న నేపథ్యంలో నగరంలోని పలు డివిజన్లలో పలు ఆలయాలను అలంకరించి ముస్తాబు చేశారు. ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పంచరంగుల తోరణాలు, అయోధ్య రాముని ఆనంద సంబరాలు అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అగ్రహారంలోని రామకోటి ప్రాంగణాన్ని, జూట్‌మిల్లు సమీపంలోని ధర్మపురి ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. సోమవారం భజనలు, అభిషేకాలు, అర్చనలు, హనుమాన్‌చాలీసా పారాయణాలు, అయోధ్య రాముని ఆనంద సంబరాల నిర్వహణకు ఆలయాలు ముస్తాబయ్యాయి.

ఆలయాల్లో ఘనంగా సర్వ ఏకాదశి పూజలు



రామచంద్రరావుపేట ఆలయంలో భక్తుల భగవద్గీత పారాయణం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 21 : సర్వ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం నగరంలో పలు శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఆరాధించారు. శ్రీవారికి తులసీదళాలతో అర్చనలునిర్వహించారు. గోవిందనామ సంకీర్తనలను ఆలపించారు. భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణలు జరిపారు. రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి, పవరుపేట వాసుదేవాలయం, అగ్రహారంలోని జనార్ధనస్వామి, పడమరవీధిలోని వేంకటేశ్వరస్వామి, అశోక్‌నగర్‌లోని శ్రీవారి ఆలయాల వద్ద భక్తులు ఆదివారం సర్వ ఏకాదశి పూజలతో ఆరాధించారు. తూర్పువీధి వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో జలాభిషేకం జరిపారు. శేషవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులుగావించి మేళ తాళాలతో అశేష భక్తుల సమక్షంలో కోవెలలో ప్రాకార ఉత్సవాన్ని నిర్వహించారు.



ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న చింతమనేని

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

పెదవేగి, జనవరి 21 : మండలంలోని గాలాయగూడెంలో వేంచేసియున్న అచ్చమ్మ పేరంటాలమ్మతల్లి అంటే తెలియనివారు ఉండరని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అమ్మ ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను ఆలయకమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఏనుగు రామకృష్ణ, శ్రీనివాసరావు, పెద్దిశెట్టి నాని, వెంకటరత్నం నాయుడు, రాంబాబు, దుర్గారావు, ఠాగూర్, ఏనుగు సర్వేశ్వరరావు, దోరేపల్లి రమేష్, సాయిన శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు మొక్కుబడుల చెల్లింపు



పెదవేగి, జనవరి 21: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలిసాయి లలితాసహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాలద్వారా రూ.27,170, లడ్డూ ప్రసాదాల విక్రయాలద్వారా రూ.16,335 ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

175 సీట్లు గెలుస్తాం: గన్ని

» వైసీపీ నుంచి టీడీపీలోకి 150 మంది చేరిక



కండువా కప్పి ఆహ్వానిస్తున్న గన్ని

కొయ్యలగూడెం, జనవరి 21: రాబోయే ఎన్నికల్లో జనసేనతో కలిసి రాష్ట్రంలో 175 సీట్లు గెలుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. బయ్యన్నగూడెంలో వైసీపీకి చెందిన బాలం పెద్దబ్బులు తన అనుచరులు 150 మందితో ఆదివారం టీడీపీలో చేరారు. జిల్లాలో అన్ని గ్రామాల నుంచి వైసీపీని వదిలి టీడీపీలో చేరుతున్నారని అన్నారు. అందరికీ గౌరవ స్థానం ఇస్తామని అన్నారు. టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, పారేపల్లి రామారావు, రాంబాబు, పారేపల్లి నరేష్, సత్యనారాయణ, వీరాస్వామి పాల్గొన్నారు.

కె.ఎస్.రామవరంలో బాబు ష్యూరిటీ..



కరపత్రాలు అందజేస్తున్న నేతలు

కామవరపుకోట, జనవరి 21 : టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కె.ఎస్.రామవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గ్యారెంటీ పత్రాలను అందజేశారు. సంకుల రాటాలరాజు, మల్లారెడ్డి పెదబాబు, చెలికాని కిరణ్, కోటపాటి శ్రీనివాసరావు, సర్గాల సతీష్, నరదల వెంకటేశ్వరరావు, పుల్లారావు, రాంబాబు, ఇస్తరాకుల అంజయ్య జన సైనికులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొడదాం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొడితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ, రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులపై అరాచకాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేస్తూ సాగు నీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి పగడం సౌభాగ్యవతి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మండల లక్ష్మణరావు, నంబూరి రామచంద్రరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

ఏలూరు రూరల్, జనవరి 21: మామిళ్ళపల్లి జయప్రకాష్, అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆప్టా ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నాగేంద్రకాలనీలో నిర్వహించారు. తొమ్మిది మంది వైద్యనిపుణులు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు ఎం.నాగిని, రితేష్, తేజశ్విని, నరేష్, శివకుమార్, రాజారామ్, మనోజ్ రోగులను పరీక్షించారు. మామిళ్ళపల్లి జయప్రకాష్ పర్యవేక్షించారు. ఇటువంటి ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.





ఏలూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐద్వా మహిళలు, లింగపాలెంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

మొండివైఖరి విడనాడాలి

» సీఎం జగన్ తీరుపై అంగన్‌వాడీల ఆగ్రహం

ఏలూరుటూటౌన్, జనవరి 21: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వామపక్షపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో విజ్ఞాపన పత్రం సమర్పించారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.కృష్ణచైతన్య, ఎ.రవి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎంసీపీఐ నేతలు ఎస్.నాగరాజు ఉన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి డిమాండ్ చేశారు. పవర్‌పేట, చోడిదిబ్బ, ఆర్‌ఆర్‌పేట ప్రాంతల్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. 40 రోజులుగా సమ్మె చేస్తుంటే మహిళలు అనే కనికరంలేకుండా సీఎం జగన్ మొండిగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. కల్యాణి, రాజేశ్వరి, దుర్గా, రేష్మా, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట్రామారావు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం అంగన్వాడీలకు మద్దతుగా సమావేశం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ అంగన్వాడీలు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని అన్నారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రిటైర్‌మెంట్ బెని ఫిట్స్ ఇవ్వాలన్నారు. ఎస్మా చట్టం ఉపయోగించటం సరైందికాదన్నారు. రెడ్డి శ్రీనివాస్‌డాంగే, బండి వెంకటేశ్వరరావు, కన్నబాబు, పుల్లారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : అంగన్‌వాడీ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో తిరిగి కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. సంఘ నేత మాణిక్యం మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

● లింగపాలెం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 41 రోజులకు చేరుకుంది. తాము చేస్తున్న సమ్మెకు ప్రజలనుంచి స్పందన ఉన్నా ముఖ్యమంత్రి స్పందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సలహాదారుతో మాట్లాడిస్తున్నాడని వాపోయారు. విజయవాడలో జరుగుతున్న ఆమరణ నిరాహార దీక్షకు తరలివెళ్లారు.

అంగన్‌వాడీలకు నోటీసులు

● లింగపాలెం: తాడేపల్లిలోని సీఎం ఇంటిని ముట్టడించేందుకు విజయవాడ వెళ్తున్న అంగన్ వాడీలకు పోలీసులు నోటీసులు అందజేశారు. తాము గ్రామం దాటి వెళితే కేసునమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు అంగన్ వాడీలు తెలియచేశారు.

● ఉంగుటూరు: అంగన్వాడీలకు ఆదివారం రాత్రి పోలీసులు నోటీసులు ఇచ్చారు. దీంతో వారంతా సంక్రాంతికి చుట్టం చూపుగా వచ్చినట్లు పేర్కొంటూ పోలీసులకు మస్కాకొట్టి ఏలూరు, విజయవాడ వెళ్లారు.



ఉంగుటూరు, లింగపాలెంలో నోటీసులు అందజేస్తున్న పోలీసులు



నియామకపత్రాలు అందజేస్తున్న అంబికా కృష్ణ

ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గం

ఏలూరు కల్చరల్, జన వరి 21: సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులుఎప్పుడూ ముం దుంటారని మాజీ ఎమ్మెల్యే, ఆర్యవైశ్య ప్రముఖులు అంబి కా కృష్ణ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అనుబంధ సంస్థ ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఇటీవల అధ్యక్షుడిగా దివ్వెల జయబాబు ఎన్నికయ్యారు. అనంతరం నగర కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా గాదంశెట్టి శ్రీనివాస్, వర్కింగ్ అధ్యక్షులుగా మద్దుల రవికుమార్, సెక్రటరీగా వేమా సురేష్, కోశాధికారిగా బచ్చు విష్ణు, ఉపాధ్యక్షులు గా కె.కె గుప్తా, వందనపు సత్యనారాయణ, రేపూరి శివ, చలువాది బాలకృష్ణతో పాటు 15 మందిని జాయింట్ సెక్రటరీలుగా నియమించారు. వీరికి అంబికా కృష్ణ నియామకపత్రాలను అందజేశారు. ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబికా రాజా పాల్గొన్నారు.



అభినందనలు తెలియజేస్తున్న కాపు సంక్షేమ యువసేన నాయకులు

కాపు సంక్షేమ యువసేన నగర కమిటీ ప్రమాణస్వీకారం

ఏలూరు రూరల్, జనవరి 21: కాపు సంక్షేమ యువ సేన ఏలూరు నగర కార్య వర్గ ప్రమాణస్వీకారం ఆది వారం ఇండోర్ స్టేడియం సమీపంలోని లేడిస్ క్లబ్ ప్రాంగణంలో జరిగింది. నగర అధ్యక్షుడిగా బడే సతీష్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాముల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి, నారా శేషు, ఎమ్.ఆర్.డి బలరామ్ ప్రసంగించారు. కాపుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు తన్నీరు బుజ్జి, ఎడ్లపల్లి ప్రసాద్, వాసా రాజు, కొటారి ఆదిశేషు, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

వైసీపీ ఏలూరు జిల్లా నియోజకవర్గస్థాయి సమావేశం


ఏలూరు రూరల్, జనవరి 21: స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో ఆదివారం వైసీపీ ఏలూరు జిల్లా నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అధ్యక్షతన జరిగింది. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు కె.అబ్బయ్యచౌదరి, దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, మేకా ప్రతాప్‌వెంకటఅప్పారావు, తెల్లం బాలరాజు హాజరయ్యారు. ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్, పోలవరం సమన్వయకర్త టి.రాజ్యలక్ష్మి, చింతలపూడి సమన్వయకర్త విజయ్ రాజును కార్యకర్తలకు పరిచయం చేశారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఈడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చింతలపూడి: నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కంభం విజయరాజు నియమితులు కావడంతో స్థానిక మార్కెట్ యార్డులో నాయకులు, కార్యకర్తలతో ఆదివారం పరిచయ వేదిక నిర్వహించారు. జానకీరెడ్డి, నీరజ, రాంబాబు, రాజేష్‌నాయుడు, ఆర్.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

31 వరకు ఉచిత దంతవైద్య సేవలు

పెదవేగి, జనవరి 21 : మండలంలోని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో సోమవారం నుంచి 31వ తేదీ వరకు ఉచిత దంతవైద్య సేవలు అందిస్తామని కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. ప్రోస్టోడంటిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన మాట్లాడు తూ, పది రోజులపాటు ఉచిత దంతవైద్య సేవలను అందిస్తున్నామన్నారు. నోటి అపరిశుభ్రతే వ్యాధులు ప్రబలడానికి మూలమని, దీన్ని దృష్టిలో పేదలకు అనువుగా దంతవైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. కృత్రిమ పూర్తి పళ్లసెట్, పాక్షిత పళ్లసెట్, పింగాణీ క్యాప్, మెటల్ క్యాప్, ఇంప్లాంట్ చికిత్స, ముఖ భాగాల పునఃసృష్టి, చిరునవ్వు పునఃసృష్టి, పూర్తి నోటి పునరావాసం వంటి సేవలు అందిస్తామని వివరించారు. అన్నిరకాల పళ్లసెట్లు ఉచితంగా అందిస్తామని, కొన్ని స్థిరచికిత్సలపై 50శాతం రాయితీ ఉంటుందని చెప్పారు.

128 మందికి కంటి పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 21 : అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఆదివారం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యనిపుణులు 128 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స నిమిత్తం వేమగిరికి తీసుకువెళ్లారు. 36 మందికి కళ్లజోళ్లు అందచేశారు. చెక్కా రాజారావు, అల్లం వెంకట సుబ్బారావు, బొడ్డు శ్రీనివాస్, గొల్లపూడి రామకృష్ణ, బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్నా వెంకట్రామయ్య బృందం సేవలు అందించారు.

ఉమా నండూరిని కలిసిన కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, జనవరి 21: జిల్లా ప్రభావరి అధికారి ఉమా నండూరి ద్వారక తిరుమల మండలం గున్నంపల్లిలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఏలూరు పోలీస్‌గెస్ట్ హౌస్‌కు చేరిన ఆమెను కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. జిల్లాలో భారత వికాస్ సంకల్పయాత్ర అమలుపై చర్చించారు. జడ్పీ సీఈవో సుబ్బారావు ఉన్నారు.



క్షేత్రాన్ని పరిశీలిస్తున్న బంగ్లాదేశీయులు

వెల్లమిల్లి ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ఉంగుటూరు, జనవరి 21: మండలంలోని వెల్లమిల్లి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం బంగ్లాదేశ్ ప్రతినిధులు సందర్శించారు. సీనియర్ శాస్త్రవేత్త పరిమి సత్యనారాయణ వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వారికి వివరించారు. ఫైవ్ లేయర్ ఏటీఎం మోడల్, ఇంటర్ క్రాపింగ్ పద్ధతిలో భాగంగా ప్రకృతి సేద్యంపై వివరాలడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛభారత్ పైలట్ ప్రాజెక్టులుగా ఐదు గ్రామాల గుర్తింపు



వార్లకోడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వెల్లూరి

కైకలూరు, జనవరి 21: గ్రామాల్లో పారిశుధ్యాన్ని పూర్తిగా నిర్మూలించేం దుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించ వలసిన బాధ్యత స్థానిక అధికారు లదేనని రాష్ట్ర స్వచ్ఛ కార్పొ రేషన్ ప్రభుత్వ సలహాదారు వెల్లూరి శ్రీని వాసన్ అన్నారు. ఆదివారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. స్వచ్ఛభారత్ పైలట్ ప్రాజెక్టులుగా ఏలూరు జిల్లాలో 5 గ్రామాలు కైకలూరు, దెందులూరు, దొరమామిడి, మోర్సపూడి, భీమడోలును గుర్తించామన్నారు. ఈ గ్రామాల్లో ప్రతి 250 కుటుంబాల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామంలో ఏ శాఖకు సంబంధించిన భూమి అయినా ప్రభుత్వానిదేనని వాటిలో స్థలాలను కేటాయించి అందించాలన్నారు. అలాగే గ్రామంలో ఐదు వార్డులలో పర్యటించి డ్రైన్లు, ఆక్రమణలు పరిశీలించారు. ఆక్రమణ ప్రదేశాలను ప్రభుత్వ పరిధిలోనికి తీసుకొని ఘన, ద్రవ వ్యర్థాల నివారణ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం కైకలూరులోని మిగిలిన 15 వార్డులలో పర్యటించి స్థలాలు పరిశీలిస్తామన్నారు. కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆదిరాజు వెంకటేశ్వరరావు, రవికిరణ్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నం వడ్డిస్తున్న కొండ

పోలవరం, జనవరి 21 : వృద్ధులు పసివారితో సమానమని టీడీపీ నేత మంగిన కొండ అన్నారు.ఇటీవల మృతి చెందిన శతాధిక వృద్ధురాలు పసుపులేటి వరహాలమ్మ (105) జ్ఞాపకార్థం మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. పెద్దలు, వృద్ధులను గౌరవించి ప్రేమతో ఆదరించాలన్నారు. జయవరపు రామాయమ్మ, శివరామ కృష్ణ, బుజ్జి బాబు, ధనలక్ష్మి, శివజ్యోతి, నాగమహేష్, కుందన శివాత్మిక, షెహిన్షాబాషా పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు రూ.70 వేల సాయం



నగదు అందజేస్తున్న నేతలు

చింతలపూడి, జనవరి 21 : మండలంలో డి.ఎన్.రావుపేటకు చెందిన జనసేన కార్యకర్త అడపా కరీముల్లాకు రూ.70 వేల ఆర్థిక సాయాన్ని ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య ఆదివారం అందజేశారు. ఏలూరులో ప్రమాదం జరగడంతో విజయవాడ ఆసుపత్రిలో అడపా చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్‌కు రూ.పది లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో పార్టీ ఆధ్వర్యంలో వసూలు చేసిన నగదును అందచేసినట్లు పేర్కొన్నారు. చీదరాల మధుబాబు, విజయకుమార్, యేసుబాబు, సాయిబాబు, వెంకటేశ్వరరావు, పున్నమనేని, రాజకుమార్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న గ్రామ ప్రముఖుడు

లింగపాలెం, జనవరి 21: అన్నపనేనివారిగూడెంలో బి.వి.ఎస్. రెడ్డి తన సొంతనిధులు రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడుతున్న విషయం సర్పంచ్ రవీంద్ర ద్వారా తెలుసుకుని వాటర్‌ప్లాంట్ నిర్మించి తాగునీటి సౌకర్యం కల్పించారు.



12వ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న జనసేన నాయకులు

మౌలిక వసతుల కల్పనలో వైసీపీ విఫలం: జనసేన

ఏలూరుకార్పొరేషన్, జనవరి 21 : జనసేన ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 12వ డివిజన్ బోండావారి వీధిలో పాదయాత్ర నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దక్షిణపువీధిలో ఉన్న మార్కండేయస్వామి ఆలయ రహదారిలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పొంగి రోడ్డు మీదకు వచ్చి దుర్వాసన వస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. తమ సమస్యలను తమ డివిజన్ కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావుకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నగిరెడ్డి కాశీ నరేష్, ఇళ్ళ శ్రీనివాస్, కస్తూరి తేజశ్విని, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, అల్లు సాయిచరణ్ పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో 'వ్యాయామ' విద్యార్థుల ప్రతిభ



షీల్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

దెందులూరు, జనవరి 21: తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీస్థాయి క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ తెలిపారు. కళాశాలలో ఈ నెల 12 నుంచి 21 వరకు జరిగిన యూనివర్సిటి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పలు విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వి.గంగాభవాని, వి.లావణ్య భార్గవి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఆదివారం వారిని అభినందించారు. షీల్డ్ అందజేశారు.

లక్కవరం పోలీస్ స్టేషన్ తనిఖీ

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : లక్కవరం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ధనుంజయుడు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకుంటూ వారి సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

పెదవేగి ఎస్ఐ బదిలీ



ఎం.లక్ష్మణ్

పెదవేగి, జనవరి 21: పెదవేగి ఎస్ఐ ఎం.లక్ష్మణ్ ఏలూరు జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. 2022 అక్టోబరు 26న ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన, ఉండి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. అధికారపార్టీతోపాటు ప్రతిపక్ష నాయకుల ప్రశంసలు అందుకున్నారు. వివాద రహితుడుగా పేరుగాంచారు. అయితే పెదవేగి ఎస్ఐగా ఎవరిని నియమిం చిందీ తెలియలేదు. పెదవేగి రావడానికి వెనక్కి తగ్గుతున్నారని పోలీసుల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

షర్మిల ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిన కాంగ్రెస్ నేతలు



విజయవాడ పయనమౌతున్న కాంగ్రెస్ నేతలు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 : విజయవాడలో జరిగిన వైఎస్ షర్మిల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు నాయకత్వంలో సుమారు 100 కార్లపై పోలవరం, చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలతో ప్రదర్శనగా విజయవాడకు తరలివెళ్లారు. తొలుత జంగారెడ్డిగూడెం పాత బస్టాండ్ సెంటర్ వద్ద దివంగత నేతలు ఇందిరాగాంధీ, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా పరిధిలో ఏలూరు, చింతలపూడి, దెందులూరు, కైకలూరు నూజివీడు నియోజకవర్గాలు నుంచి భారీ ప్రదర్శనతో విజయవాడ చేరుకున్నారు. ముప్పిడి శ్రీనివాసరావు, మద్దాల ప్రసాద్, పైడిముక్కల మురళీకృష్ణ, హీర హకీమ్, కూనపు రాజరత్నం, సంకురు బాబురావు, పోతురాజు, నులకాని నాగబాబు, జుంగ బాబ్జి ఉన్నారు.



టి.నర్సాపురంలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

లెనిన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» వర్ధంతి సభలో పలువురి ఘన నివాళి

టి.నరసాపురం, జనవరి 21 : తొలి శ్రామికవర్గ విప్లవ నిర్మాత లెనిన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఎం మండల కార్యదర్శి అనుమోలు మురళి అన్నారు. అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం లెనిన్ 100వ వర్ధంతి నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లెనిన్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. మడకం కుమారి, బరగడ కుమారి, చెల్లెమ్మ, అమ్మాజి తదితరులు ఉన్నారు.

● ఏలూరుటూటౌన్: సమసమాజ స్థాపన కోసం లెనిన్ చూపిన బాటలో పయనించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. లెనిన్ శతవర్ధంతి కార్యక్రమం సీపీఎం జిల్లా కార్యాలయంలో పి.కిషోర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. శ్యామలరాణి, సాయిబాబు, జగన్నాధరావు, కనకారావు, కోటేశ్వరరావు, లెనిన్ పాల్గొన్నారు.

● కామవరపుకోట: సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. చలమాల శ్రీనివాసరావు, మీనుగుల దుర్గారావు, కూతాటి వెంకటేశ్వరరావు, మారం సత్యనారాయణ, బి.వి.రాఘవులు, నల్లమోతుల అప్పన్న, బాలిన రమణారావు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మార్కిస్టు మహోపాధ్యాయులు లెనిన్ చూపిన విప్లవ బాటలో ముందుకు సాగుదామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ పిలుపునిచ్చారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్మన్న స్మారక భవనంలో సభ నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ, రష్యాలో జారు చక్రవర్తి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని, ప్రజలను చైతన్యపరిచి విప్లవాన్ని సాధించిన లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. ధర్ముల సురేష్, పి.శ్రీనివాస్, రమణ, సరియం రామ్మోహన్, వెట్టి సుబ్బన్న, కారం రాఘవ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కామవరపుకోటలో..

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

చింతలపూడి, జనవరి 21 : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో దివ్యాంగుడైన భూక్యా బాలుకి బొప్పన రాధమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా ట్రై సైకిల్‌ను టీడీపీ ఆధ్వర్యంలో పల్లె శ్రీను అందజేశారు. అనీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింక్ తెరిచారో.. సొమ్ము గల్లంతే

అయోధ్యపై లైవ్ స్ట్రీమింగ్ ప్రకటనలతో బహుపరాక్: సీఐ

కైకలూరు, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోషల్ మీడియాలో లైవ్ స్ట్రీమింగ్ పేరుతో వస్తున్న ప్రకటనలను ఓపెన్ చేస్తే మోసానికి గురయ్యే ప్రమాదముందని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు తెలిపారు. ప్రాణప్రతిష్ఠ లైవ్ అంటూ, రామమందిర విశేషాలంటూ ఇలా వేరు వేరు పేర్లతో లింకులు పెట్టి సైబర్ నేరస్థులు దోపిడీలకు పాల్పడతారని హెచ్చరించారు. ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలలో ఉండే సొమ్మును కాజేస్తారన్నారు. అందువల్ల ప్రజలు టీవీల్లో వచ్చే లైవ్ ద్వారా రామమందిర ప్రతిష్ఠను తిలకించాలని సోషల్ మీడియాలో వచ్చే లింకులను ఓపెన్ చేస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడతారని హెచ్చరించారు.

విజయవాడ తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కాంగ్రెస్ నాయకుడు జేడీ శీలం తదితరులతో పీసీసీ సభ్యుడు బాబీ

ముదినేపల్లి, జనవరి 21 : విజయవాడలో ఆదివారం పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతల స్వీకారం సందర్భంగా ముదినేపల్లి మండలం నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పీసీసీ సభ్యుడు మంగినేని బాబీ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

కృష్ణవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ఆగిరిపల్లి, జనవరి 21: ఆగిరిపల్లి మండలం సూరవరం, కృష్ణవరం గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు మారు మూల గ్రామాలకు కూడా వెళ్లాలనే లక్ష్యంతో ఈ యాత్ర జరుగుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తెలిపారు. ఈ సభలో లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు, గ్యాస్ కంపెనీ అధినేత పాలడుగు శ్రీనివాస్ అందించారు. సర్పంచ్‌లు గరికపాటి వెంకటేశ్వరరావు, కమ్మిలి జ్యోతి పాల్గొన్నారు.



సొమ్ము అందజేస్తున్న రజక సంఘం

రజక సంఘం ఆర్థిక సాయం

మండవల్లి, జనవరి 21: మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పగిళ్ళ తేజశ్రీ చిత్రపటానికి కైకలూరు నియోజకవర్గ రజక సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఈ రోడ్డు ప్రమాదంలో గాయపడిన మృతురాలి సోదరి పగిళ్ళ పల్లవిదుర్గ చికిత్సకు రూ.15 వేలు రజక సంఘం తరపున అందజేశారు. ఈ మేరకు బాధితురాలి తండ్రి పగిళ్ళ నాగబాబును సంఘం సభ్యులు పరామర్శించారు. టీడీపీ నాయకుడు, జిల్లా రజక సాధికార డైరెక్టర్ వీరవల్లి శివయ్య, వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి అంతర్వేది పెద్దిరాజు, కోశాధికారి రాము, న్యాయవాది కనుమూరి రమాదేవి, నాగరాజు పాల్గొన్నారు. తేజశ్రీ చిత్రపటానికి ఆదివారం కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనయుడు దూలం వినయ్‌కుమార్ నివాళులర్పించారు.



ఘనంగా సంబరాలు

కైకలూరు, జనవరి 21: ఆటపాకలో గంగానమ్మ, నరసాయిపాలెంలో ముత్యాలమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గంగానమ్మకు భక్తులు పానకం, వడపప్పు, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పూజలు చేశారు. నరసాయిపాలెంలో ముత్యాలమ్మ సంబరాలను గ్రామస్థులు బంధుమిత్రులతో కలిసి నిర్వహించారు.

'వ్యాయామ' విద్యార్థుల ప్రతిభ



షీల్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

దెందులూరు, జనవరి 21: తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీస్థాయి క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారని గోపన్నపాలెంలోని శ్రీసీతా రామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ తెలిపారు. కళాశాలలో ఈ నెల 12 నుంచి 21 వరకు జరిగిన యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పలు విభాగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వి.గంగాభవాని, వి.లావణ్య భార్గవి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఆదివారం వారిని అభినందించి షీల్డ్ అందజేశారు.

స్పీడ్ బ్రేకర్లేవీ..?

హెచ్చరిక బోర్డులు నిల్



ప్రమాదకరంగా మద్వానిగూడెం – ఏలూరుపాడు వంతెన

- ప్రమాదకరంగా మద్వానిగూడెం-ఏలూరుపాడు వంతెన
- వంతెనపై నుంచి దూకి పలువురి ఆత్మహత్య
- పోలీస్ పికెట్ ఏర్పాటుకూ గ్రామస్థుల వినతి

కలిదిండి, జనవరి 21 : ఉప్పుటేరుపై గల మద్వానిగూడెం - ఏలూరుపాడు వంతెన కిరుపక్కలా అప్రోచ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. వంతెనకు ఇరుపక్కలా ఉప్పుటేరు వెంబడి గ్రామాలకు ప్రధాన రహదారి కావటంతో వంతెనపై నుంచి వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ వంతెన ఆత్మహత్యలకు నిలయంగా మారింది. పలువురు ఈ వంతెనపై నుంచి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వంతెనకు ఇరువైపులా స్పీడు బ్రేకర్లు లేక వాహనాలు వేగంగా రాకపోకలు సాగించటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాసులతోపాటు కృష్ణా జిల్లాకు చెందిన వారు కూడా ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెన సమీపంలో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారు..?

ఈ విషయమై ఆర్ అండ్ బీ డీఈఈ విజయ శ్రీకర్‌ను వివరణ కోరగా, వంతెన ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముద్దరబోయిన, బీసీ నాయకులు



గోపవరంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆగిరిపల్లిలో జయహో బీసీ

ఆగిరిపల్లి, జనవరి 21: చంద్రబాబు తలపెట్టిన జయహో బీసీ కార్యక్రమానికి మద్దతుగా టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎన్టీఆర్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముద్దరబోయిన మాట్లాడుతూ సీఎం జగన్ బీసీల ద్రోహి అని, బీసీలకు రాజకీయంగా పైకి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబు, ఎన్టీఆర్‌దేనని, బీసీలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం బీసీలకు ఉన్న రిజర్వేషన్‌లను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 10 శాతం కోత విధించాడన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీల పై దాడులు పెరిగాయని, అన్నికులాలు, వర్గాలకు సమన్యాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి తెస్తారన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు జి.రమేష్, పార్టీ మండల అధ్యక్షులు మల్లివల్లి కోటేశ్వరరావు, తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు చిట్నేని శివరామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య, బీసీ సెల్ నాయకులు శ్రీనివాసచక్రవర్తి, ఆరేపల్లి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ నాయకుడు మరీదు శివరామకృష్ణ, పామర్తి నర్సయ్య, తలపంటి రాజశేఖర్, గోళ్ళరాజు, జన్యావుల రాజశేఖర్, నక్కనబోయిన సాంబశివరావు, బీసీ నాయకురాలు మాదాసు చంద్రకళ, విక్టర్‌బాబు, నూతలపాటి నాగభూషణం, నాలుగు మండలాల పట్టణ పార్టీ అధ్యక్షులు, బీసీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అన్యాయం

ముసునూరు: వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ నాయకులు ఉప్పలపాటి గణేష్ అన్నారు. గోపవరం బీసీ, ఎస్సీ కాలనీల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసి, నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడిన జగన్‌రెడ్డి, అన్నివర్గాలను మోసం చేశాడని గణేష్ విమర్శించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలని కోరారు. టీడీపీ నాయకులు వడ్లపట్ల మురళీమోహన్, చిలకంటి శేషు, కర్రా ఏసుపాదం, సాయిల అనిల్, కె.శివశ్రీను తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో వార్లకోడును పరిశీలిస్తున్న శ్రీనివాసన్

స్వచ్ఛభారత్ పైలట్ ప్రాజెక్టులుగా 5 గ్రామాల గుర్తింపు

- రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసన్

కైకలూరు, జనవరి 21: గ్రామాల్లో పారిశుధ్యాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించవలసిన బాధ్యత స్థానిక అధికారులదేనని రాష్ట్ర స్వచ్ఛ కార్పొరేషన్ ప్రభుత్వ సలహాదారు వెల్లూరి శ్రీనివాసన్ అన్నారు. ఆదివారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. స్వచ్ఛభారత్ పైలట్ ప్రాజెక్టులుగా ఏలూరు జిల్లాలో 5 గ్రామాలు కైకలూరు, దెందులూరు, దొరమామిడి, మొర్సపూడి, భీమడోలును గుర్తించామన్నారు. ఈ గ్రామాల్లో ప్రతి 250 కుటుంబాల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామంలో ఏ శాఖకు సంబంధించిన భూమి అయినా ప్రభుత్వానిదేనని వాటిలో స్థలాలను కేటాయించి అందించాలన్నారు. అలాగే గ్రామంలో 5 వార్డులలో పర్యటించి డ్రైన్లు, ఆక్రమణలు పరిశీలించారు. ఆక్రమణ ప్రదేశాలను ప్రభుత్వ పరిధిలోనికి తీసుకొని ఘన, ద్రవ వ్యర్థాల నివారణ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం కైకలూరులోని మిగిలిన 15 వార్డులలో పర్యటించి స్థలాలు పరిశీలిస్తామన్నారు. కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, పంచాయతీ కార్యదర్శులు ఆదిరాజు వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని హాజరుపర్చిన డీఎస్పీ

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- 17న బూరుగ్గూడెంలో కత్తిపీటతో దాడి ఘటన
- చికిత్స పొందుతూ మృతి చెందిన బాధితుడు

చాట్రాయి, జనవరి 21: వివాహేతర సంబంధానికి అడ్డుపడుతున్నందునే చీపురుగూడెం గ్రామానికి చెందిన అబ్బదాసరి కృష్ణ (38)ను నిందితుడు పత్తిపాటి నాగరాజు హతమార్చాడని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు నాగరాజును విలేకరుల ఎదుట హాజరుపర్చి డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెలకు చెందిన పత్తిపాటి నాగరాజుకు, చీపురుగూడెంకు చెందిన అబ్బదాసరి కృష్ణ సోదరితో వివాహేతర సంబంధం ఉందని, ఈ నెల 17న బూరుగ్గూడెంలోని తన సోదరి ఇంటికి కృష్ణ రావడంతో తమ వివాహేతర సంబంధానికి అతను అడ్డుపడుతున్నాడని కక్ష పెంచుకున్న నాగరాజు బూరుగ్గూడెం వచ్చి చెక్క కత్తిపీటతో కృష్ణ తలపై బలంగా మోది పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన కృష్ణను 108లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందినట్లు డీఎస్పీ వివరించారు. పరారీలో ఉన్న నిందితుడు పత్తిపాటి నాగరాజును ఆదివారం చనుబండ వద్ద నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్, చాట్రాయి ఎస్సై స్వామి సిబ్బందితో కలసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.



కంకర తిరగేసి వదిలేసిన మూల్లంక – పెదలంక రహదారి

కంకర తిరగేసి వదిలేశారు!

- ఆర్నెల్లుగా నరకం అనుభవిస్తున్న ప్రయాణికులు
- బస్సులను సైతం నిలిపివేసిన అధికారులు
- మూల్లంక-పెదలంక రహదారి దుస్థితి

అధ్వాన రహదారులతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. కలిదిండి, ముదినేపల్లి మండలాల్లోని పలు రహదారులు అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి.

కలిదిండి, జనవరి 21 : లంక గ్రామాల రహదారులు గుంతలు పడి అధ్వానంగా మారటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారిపై ప్రయాణానికి ద్విచక్ర వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. మూల్లంక నుంచి పెదలంక వరకు ఆరు కిలోమీటర్ల మేర రహదారి కంకర తిరగేసి తారు వేయకుండా వదిలేశారు. దీంతో రహదారి గుంతలు పడి అధ్వాన్నంగా మారి ప్రయాణించేందుకు వీలు లేకుండాపోయింది. దీంతో మచిలీపట్నం- పెదలంక ఆర్టీసీ బస్సు నిలుపుదల చేశారు. రహదారి మరమ్మతులు చేస్తేనే బస్సు రాకపోకలు సాగిస్తుందని ఆర్టీసీ అధికారులు హుకుం జారీ చేశారు.

గుంతలమయంగా మద్వానిగూడెం-మట్టగుంట రహదారి

మద్వానిగూడెం - మట్టగుంట రహదారి కూడా సుమారు 7 కిలోమీటర్ల మేర గుంతలు పడటంతో రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో నిత్యం తవుడు లోడు లారీలు చేపల ఎగుమతుల లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి గోతులు పడటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఆక్వా రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. లంక గ్రామాల ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకులు రోడ్లు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధిని పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లంక గ్రామాల ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారు..?

ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ విజయశ్రీకర్‌ను వివరణ కోరగా, లంక గ్రామాల ప్రధాన రహదారికి రూ.11 కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తి కాగానే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు.

ముదినేపల్లి పీహెచ్‌సీ వద్ద కుంగుతున్న రహదారి



కుంగుతున్న ముదినేపల్లి పీహెచ్‌సీ రహదారి

ముదినేపల్లి, జనవరి 21 : ముదినేపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా తయారయింది. అన్నవరం రోడ్డు నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ఈ కొద్దిపాటి రోడ్డు కుంగిపోతోంది. సుమారు వంద మీటర్ల దూరం మాత్రమే ఉన్న ఈ రహదారి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవటం లేదు. పీహెచ్‌సీ ఆవరణలోకి వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఆవరణ గేటు వద్ద పశువులు రాకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఐరన్ పైపులు కూడా కదిలిపోతున్నాయి. ఈ రోడ్డులో డ్రైన్ ఉన్న ప్రదేశం రోజు రోజుకీ కుంగిపోతోంది. చెట్లతో మూసుకుపోవటంతో రోడ్డు కుంచించుకుపోతున్నది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆగిరిపల్లి మెయిన్ రోడ్డులో శాకాహార ర్యాలీ

జీవహింస మానండి

ఆగిరిపల్లి, జనవరి 21: శాకాహారమే అమృతమని జీవహింస మానాలని, అహింసే మన ధర్మమని పిరమిడ్ మాస్టర్ భాగ్యలక్ష్మి తెలిపారు. గరికపాటి పిరమిడ్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ప్రధాన రహదారులలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పలువురు సేవకులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాలతో ముస్తాబైన ఈదర సహాయమాత ఆలయం

నేటి నుంచి సహాయమాత ఉత్సవాలు

ఆగిరిపల్లి, జనవరి 21: ఈదర సహాయమాత ఆలయం అంగరంగ వైభవంగా ముస్తాబైంది. నవదిన ప్రార్థనల్లో ఆఖరిరోజు ఆదివారం జగన్నాథపురం నుంచి రెవరెండ్ ఫాదర్ సుగుణరావు వచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాత్రి 7.30 నుంచి 10 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సోమవారం నుంచి మూడు రోజులు సహాయమాత ఉత్సవాలు జరుగుతాయని కమిటీ తెలిపింది.

నేడు కోడూరులో కామినేని ఆత్మీయ సమావేశం

కైకలూరు, జనవరి 21: మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సోమవారం ముదినేపల్లి మండలం కోడూరులో జరిగే ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని ఆయన వ్యక్తిగత సహాయకులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కోడూరులో పర్యటిస్తారని, రాత్రి 8 గంటలకు కలిదిండి మండలం సానారుద్రవరంలో జరిగే వివాహ వేడుకలో పాల్గొంటారని తెలిపారు.

యంగ్ ఇన్వెస్టిగేటర్‌గా డాక్టర్ కృష్ణలత



నూజివీడు, జనవరి 21: నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన డాక్టర్ తమ్మినేని కృష్ణలత బయోకెమిస్ట్రీలో యంగ్ ఇన్వెస్టిగేటర్ అవార్డును అందుకున్నారు. బయోకెమిస్ట్రీలో బ్రెస్ట్ క్యాన్సర్ పై ఈనెల 19, 20 తేదీల్లో భోపాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను యంగ్ ఇన్వెస్టిగేటర్‌గా ఎంపిక చేశారు. ఈమె సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావుకు కోడలు. ప్రస్తుతం ఈమె కర్నాటకలోని తుముకూరు సిద్ధగంగా మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడిగా నాగబాబు



ముసునూరు, జనవరి 21: జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడిగా రమణక్కపేటకు చెందిన నియోజక వర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు నియమితుల య్యారు. ఆదివారం మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ అధినాయకత్వానికి నాగబాబు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నూజివీడు అధ్యక్షుడిగా అప్పారావు



నూజివీడు టౌన్, జనవరి 21: బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడిగా బోను అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చోడపల్లి విక్రమ్‌కిషోర్ ఉత్తర్వులను జారీ చేశారు. గతంలోను పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షుడిగా అప్పారావు పనిచేశారు. తిరిగి ఆయననే పట్టణ అధ్యక్షుడిగా నియమించటం పట్ల నూజి వీడు నియోజకవర్గ సమన్వయకర్త రంగారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

ముసునూరు, జనవరి 21: యువత క్రీడల్లో నైపుణ్యం సాధించి, ఉన్నత స్థాయికి వెళ్ళాలని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి ఆటల పోటీలు ముగిశాయి. కబడ్డీలో అక్కిరెడ్డిగూడెం విన్నర్‌గా, గుళ్ళపూడి రన్నర్‌గా నిలిచింది, క్రికెట్‌లో చెక్కపల్లి విన్నర్, ముసునూరు-2 రన్నర్, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో చెక్కపల్లి విన్నర్, చింతలవల్లి రన్నర్, ఖోఖోలో ముసునూరు-1 విన్నర్‌గా, చింతలవల్లి రన్నర్‌గా, వాలీబాల్ పురుషుల విభాగంలో ముసునూరు-1 విన్నర్‌గా, రమణక్కపేట రన్నర్‌గా, మహిళల వాలీబాల్‌లో ముసునూరు-2 విన్నర్‌గా నిలిచాయి. మహిళల బ్యాడ్మింటన్‌లో చింతలవల్లి విన్నర్‌గా, వలసపల్లి రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్లు, క్రీడాకారులకు షీల్డ్‌లు, ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ, పీఈటీలు, సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరు : చిన్నం



చాట్రాయి, జనవరి 21: పేదలు, రైతుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య స్పష్టం చేశారు. బూరుగ్గూడెంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయని, అవినీతి పరులైన నాయకులకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఫిబ్రవరి 11న చాట్రాయిలో ప్రజా సభ నిర్వహిస్తామని, ప్రజ లు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రతికంటి రామచంద్రరావు, సుజనరావు, సుబ్బారెడ్డి, చందు, జోషి, ములగలపాటి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామకోటయ్యకు పలువురి మద్దతు

ముసునూరు: నూజివీడు నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న రామకోటయ్యకు చిల్లబోయినపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బళ్ళ నాగరాజు, వైసీపీ గ్రామ మాజీ అధ్యక్షులు సుధాకర్ మద్దతు ప్రకటించారు. రామకోటయ్య వారిని సన్మానించారు.